కోలాహలంగా రథోత్సవం





మూలాపేటలో కొలువైన భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరుడి రథోత్సవాన్ని కోలాహలంగా సోమవారం నిర్వహించారు. దాదాపు మూడు గంటల పాటు రథోత్సవం వేడుకగా సాగింది. విశేషాలంకారంలో కొలువైన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. రథోత్సవాన్ని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ ప్రారంభించారు.

– నెల్లూరు (బృందావనం)





రథోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉంది

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. రథోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పరమేశ్వరుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. ఆప్కాఫ్ చైర్మన్ అనిల్‌బాబు, గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ సభ్యుడు గిరీష్‌కుమార్‌రెడ్డి, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, ఈఓ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

45 నిమిషాల జాప్యం

రథ మండపం వద్ద తూర్పు వైపు నుంచి రథోత్సవం ఏటా ముందుకు సాగేది. అయితే ఈ ఏడాది రథం నిలిచే ప్రాంతం వెనుక వైపు వీరశైవుల కల్యాణ మండపాన్ని నిర్మించారు. దీంతో మండపం వెనుక వైపున ఉత్తర దిక్కుకు రథ ముఖాన్ని ఉంచారు. ఈ క్రమంలో ఉత్తర దిశ నుంచి తూర్పు దిశకు రథాన్ని మరల్చి రథోత్సవాన్ని నిర్వహించేందుకు కొంత ఇబ్బందులు పడ్డారు. దీంతో ఉదయం 10.30కు ప్రారంభమైన రథోత్సవం మలుపు తిరిగేందుకు దాదాపు 45 నిమిషాలు పట్టింది.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో కొలువైన రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని నేత్రపర్వంగా సోమవారం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మాతృ భాషను కాపాడుకోవాలి



నెల్లూరు (టౌన్): మాతృ భాషను కాపాడుకోవాలని తెలుగు భాషా సమితి అధ్యక్షుడు భాస్కర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కస్తూరిదేవి స్కూల్లో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తొలుత తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, కార్యదర్శి అన్నపూర్ణ, నరసింహారెడ్డి, సూర్యప్రకాష్, రసూల్, హెచ్‌ఎంలు వనజ, నజ్మా, అరుణ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరించాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 44, 45, 46వ డివిజన్లకు సంబంధించిన కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశాన్ని ఆచారివీధిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ.. గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి ఉన్న తేడాను తెలియజేయాలని సూచించారు. కార్పొరేటర్లు రాఘవ, వేదవతమ్మ, వేలూరు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లికి ఘన నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ నేతలు సోమవారం నిర్వహించారు. ఇందిరాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నేతలు శేషారెడ్డి, వెంకట్రావ్, శ్రీనివాసులురెడ్డి, అల్లావుద్దీన్, చాంద్‌బాషా, లతారెడ్డి, పవన్‌కుమార్, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఐడీ విచారణ

నెల్లూరు(క్రైమ్): జిల్లా కేంద్ర కారాగారంలో గతంలో పనిచేసిన ఓ సూపరింటెండెంట్‌పై జీవిత ఖైదీ వెంకటేశ్వర్లు చేసిన ఆరోపణలపై సీఐడీ అధికారుల విచారణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా సదరు అధికారిని నెల్లూరులో సీఐడీ అధికారులు సోమవారం విచారించారని సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

26న మిస్ సింహపురి ఆడిషన్స్



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): మిస్ సింహపురి ఆడిషన్స్‌ను ఈ నెల 26న నిర్వహించనున్నారని 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో స్టార్ ఈవెంట్స్ ఆర్గనైజర్ రాజుతో కలిసి సోమవారం ఆవిష్కరించిన అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడారు. నగరంలోని తేజశ్విని గ్రాండ్ హోటల్లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని చెప్పారు. అనంతరం రాజు మాట్లాడారు. 16 నుంచి 25 ఏళ్లలోపు యువతులు పాల్గొనవచ్చని చెప్పారు. ఎంపికైన వారికి మార్చి 26న గ్రాండ్ ఫైనల్స్‌ను నిర్వహించనున్నామని వివరించారు. ఆసక్తి గల వారు 81252 72860 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సత్యంజీ, తేజ, డాక్టర్ దుర్గా అఖిల్, కళాసంఘాల కన్వీనర్లు హరిబాబు, అమీర్‌జాన్, హరనాథ్‌రెడ్డి, రాజు, చిట్టిబాబు, నారాయణబాబు శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌పై శిక్షణ తరగతులు రేపు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు సంబంధించి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ అధ్యాపకులు, ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌కు శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించనున్నామని ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్సీ సెంటర్‌లోని రావూస్ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న శిక్షణ తరగతులకు తప్పక హాజరుకావాలని కోరారు.

కళా వందనం



నెల్లూరు(బృందావనం): అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని హరనాథపురానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు పద్మారత్నం కళారూపమిచ్చారు. మాతృ భాష తెలుగుకు ప్రతిరూపంగా భావించే తెలుగు తల్లి.. తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు చిత్రాలను రావి ఆకుపై వాటర్ కలర్స్‌తో తీర్చిదిద్దారు.

నారాయణతత్వంపై ప్రవచనలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నారాయణతత్వంపై నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి ప్రవచించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

మధ్యవర్తిత్వానికి వెళ్లిన వారిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): మధ్యవర్తిత్వానికి వెళ్లిన వ్యక్తితో పాటు అతని స్నేహితులపై కొందరు హత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం కలివెలపాళెంలో నివాసం ఉంటున్న భాస్కర్ స్నేహితుడు లిఖిత్, అతని తమ్ముడు రాజేష్‌కు నెల్లూరుకు చెందిన బలరామ్, అనిల్‌కూ విభేదాలున్నాయి. ఈ విషయమై మధ్యవర్తిత్వం చేసుకునేందుకు వెళ్దామని లిఖిత్ తన స్నేహితుడు భాస్కర్‌కు సూచించారు. దీంతో భాస్కర్, లిఖిత్, రాజేష్, వారి స్నేహితులతో కలిసి హరనాథపురంలోని వీబీఆర్ స్కూల్ సమీపంలోకి ఆదివారం వెళ్లారు. అప్పటికే అక్కడ ఉన్న బలరామ్, అనిల్, మరి కొందరు బీర్ బాటిళ్లు, కత్రలతో భాస్కర్, లిఖిత్, రాజేష్ వారి స్నేహితులపై దాడి చేశారు. ఘటనలో భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు రావడాన్ని గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ ఎస్సై సుభానీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊరెళ్లారు.. ఇంటిని కొల్లగొట్టారు

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాన్ని పగలగొట్టి బీరువాలోని నగలు, నగదును అపహరించుకెళ్లిన ఘటన బీవీనగర్‌లో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌లోని సాయిబాబా మందిర సమీపంలో కోర్టు ఉద్యోగి కృష్ణమరాజు కుటుంబం నివాసం ఉంటోంది. అనంతసాగరం మండలం చిలకలమర్రిలో తన బావమరిది భార్య సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొనేందుకు గానూ తన భార్య, కోడలు, మనవడ్ని ఈ నెల 17న కృష్ణమరాజు పంపారు. మరుసటి రోజు ఇంటికి తాళం వేసి ఆయన వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి బీరువాలోని సుమారు రూ.11 లక్షల విలువజేసే 28 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.80 వేల నగదు, 1300 గ్రాముల వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్న ఆయన చోరీ విషయాన్ని నిర్ధారించుకొని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ నరసింహారావు పరిశీలించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నంతో పాటు ఆమె భాగం ఆస్తిని తీసుకురావాలంటూ వివాహితను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటి వారిపై దిశ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇందుకూరుపేట మండలం మైపాడుకు చెందిన సింధూరకు వెంకటగిరికి చెందిన వెటర్నరీ వైద్యుడు కార్తీక్‌తో 2019లో వివాహమైంది. ఆ సమయంలో ఆమె కుటుంబసభ్యులు 70 సవర్ల బంగారు, రూ.10 లక్షలను కట్న కానుకల కింద కార్తీక్, అతని కుటుంబసభ్యులకు ఇచ్చారు. వివాహానంతరం వీరు వెంకటగిరిలో కాపురం పెట్టారు. ఆమె ఓ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. కొంత కాలం అనంతరం భర్త, అత్తింటి వారు అదనపు కట్నంతో పాటు తల్లిదండ్రుల వద్ద నుంచి ఆమె భాగం ఆస్తిని తీసుకురావాలని వేధించసాగారు. సింధూర తాలూకు జీతాన్ని భర్త తన ఖాతాకు బదిలీ చేసుకొని ఆమెను పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఆమె ఓ పాపకు జన్మనిచ్చారు. దీంతో నగరంలోని సుబేదారుపేటలో కాపురం పెట్టారు. అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఆమెను ఇంటి నుంచి గెంటేసి తల్లిదండ్రుల నుంచి ఆస్తిని తీసుకురావాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శేఖర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- రూ.ఐదు లక్షల సొత్తు దగ్ధం

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూటై అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు.. మూలాపేటలోని రాజాగారివీధిలో నివాసం ఉంటున్న శివరామకృష్ణ తన ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి సోమవారం బయటికెళ్లారు. ఈ క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూటై మంటలు వ్యాపించాయి. విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బంది, బాధితుడికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనలో రూ.ఐదు లక్షల విలువజేసే సొత్తు, డాక్యుమెంట్లు, తదితరులు అగ్నికి ఆహుతయ్యాయి.

- గ్యాస్ లీకై మంటలు వ్యాపించిన ఘటన మూలాపేటలోని కొండదిబ్బలో చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు.. కొండదిబ్బలో నివాసం ఉంటున్న సునీత సోమవారం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికుల సహకారంతో మంటలను ఆమె అదుపులోకి తీసుకొచ్చారు. ఘటన స్థలాన్ని అగ్నిమాపక సిబ్బంది పరిశీలించారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): రైలు ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని వంతెనను వృద్ధుడు దాటుతుండగా, బెంగళూరు నుంచి ధన్‌బాద్ వెళ్తున్న రైలు ఢీకొంది. దీంతో పక్కన పడిపోయిన వృద్ధుడి తలకు తీవ్రగాయమైంది. విషయాన్ని గమనించిన స్థానికులు సీసీఎస్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న 108 సిబ్బందికి విషయాన్ని తెలియజేశారు. ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా, అప్పటికే వృద్ధుడు మృతి చెందారని నిర్ధారించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద సెల్‌ఫోన్, గొలగమూడి వెంకయ్యస్వామి సేవ వలంటీర్ సుబ్రహ్మణ్యన్, చెన్నై పేరిట ఉన్న ఫొటో ఐడీ కార్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా అతని ఆచూకీని కనుగొంటున్నారు.

క్లుప్తంగా

ప్రత్యేక సర్వీసులతో ఆర్టీసీకి రూ.17 లక్షల ఆదాయం

నెల్లూరు (క్రైమ్): శివరాత్రి ప్రత్యేక సర్వీసుల ద్వారా ఆర్టీసీకి రూ.17 లక్షల ఆదాయం వచ్చింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు నెల్లూరు రీజియన్ నుంచి మొగిలిచర్ల, కోటితీర్థం, భైరవకోన, సిద్ధేశ్వరం, కోవిలంపాడు, కాటేపల్లి, శ్రీశైలానికి 90 ప్రత్యేక సర్వీసులను నడిపారు. ప్రత్యేక సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేయడంతో భక్తుల నుంచి ఆదరణ పెరిగింది. దీంతో సంస్థకు రూ.17 లక్షల మేర ఆదాయం వచ్చిందని జిల్లా రవాణా ప్రాంతీయ అధికారి శేషయ్య తెలిపారు.

హోంగార్డ్స్ ఆర్‌ఐ సస్పెన్షన్

నెల్లూరు(క్రైమ్): వివిధ ఆరోపణల నేపథ్యంలో హోంగార్డ్స్ ఆర్‌ఐ లక్ష్మీనారాయణను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమవర్మ ఉత్తర్వులను సోమవారం జారీ చేశారు. వివిధ ఆరోపణల నేపథ్యంలో ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు ఏఎస్పీ స్థాయి అధికారి విచారణ జరిపారు. నివేదికను డీఐజీకి పంపగా, దాని ఆధారంగా ఆర్‌ఐను విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఉత్తర్వులను ఆర్‌ఐకు ఏఆర్ అధికారులు అందజేశారు.

సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని జనార్దన్‌రెడ్డికాలనీలో నిర్మిస్తున్న ఇండోర్ సబ్‌స్టేషన్ పనులను విద్యుత్‌శాఖ కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ సోమవారం పరిశీలించారు. సమాచారాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్‌కు అందించాల్సిన విద్యుత్ లైన్లు, కేబుల్ వ్యవస్థ, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్లపై సూచనలు చేశారు. నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, ఏఈ మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల బైండోవర్

నెల్లూరు(క్రైమ్): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు అవకాశం ఉన్న రౌడీషీటర్లు, పాత నేరస్తులు, ఎన్నికల కేసుల్లో ఉన్న వారి బైండోవర్ల ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా సారాయి అంగడి సెంటర్ వద్ద నేతాజీనగర్‌కు చెందిన రౌడీషీటర్ రాకేష్, ప్రగతినగర్‌కు చెందిన రౌడీషీటర్ వేణుగోపాల్‌ను దర్గామిట్ట పోలీసులు సోమవారం బైండోవర్ చేశారు.

విశ్రాంత ప్రభుత్వోద్యోగుల సమావేశం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ సమావేశాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో సోమవారం నిర్వహించారు. మోకాళ్ల శస్త్రచికిత్స, కంటి ఆపరేషన్లు, దంత చికిత్సలపై వివిధ ఆస్పత్రులకు చెందిన వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్లు లైఫ్ సర్టిఫికెట్లను ఈ నెల 28లోపు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుధాకర్‌రావు, శ్రీలక్ష్మి, కోశాధికారి మురళీమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ లోన్ ఎక్స్‌పోకు విశేష స్పందన



రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న శ్రీనివాస్ కణ్ణన్

నెల్లూరు(అర్బన్): కరెంటాఫీస్ సమీపంలోని కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద మెగా రిటైల్ లోన్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం, రిటైల్ అసెట్ హబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. హ్యూండయ్, హోండా, మారుతి, కియా, స్కోడా, తదితర డీలర్లు ఆయా కంపెనీల వాహనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్ రీజినల్ హెడ్ శ్రీనివాస్ కణ్ణన్, రిటైల్ అసెట్ హబ్ డివిజనల్ మేనేజర్ కృష్ణకుమార్ మాట్లాడారు. రిటైల్ ఎక్స్‌పోలో రూ.7.6 కోట్ల రుణాలను మంజూరు చేశామన్నారు. అనంతరం పలువురు ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. జిల్లా సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ వీరేంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.